

కథా కౌముది

ఎ నోన్ స్ట్రేంజర్ — మణి వడ్లమాని

ఎప్పుడూ సందడిగా ఉండే ఆ ఇల్లు ఆ రోజు, నిశ్శబ్దంగా ఉంది. కారణం సన్నాసి కనిపించటం లేదు

ఆ వార్త ఒక్క క్షణంలో ఊరంతా పాకిపోయింది. అందరూ అతని ఇంటి ముందు గుమికూడారు.

ఎవరో మెల్లగా అంటున్నారు "ఎక్కడకి వెళ్లిపోయారంటారు?"

"అతనో వెయ్యిళ్ళపూజారి ."

"స్వార్థం లేని వాళ్ళు ఇలాగే వెళ్తారు" అని కొందరంటే మరి కొందరు "మంచి మనిషి... మహానుభావుడు" అని అన్నారు.

అందరిని ఎరుగున్నట్టుగా పలకరించే వాడు. ఒక్కసారి చూసి కళ్ళు మరోవైపుకు తిప్పేవాడు. 'ఎవరబ్బా, ఇతను..?ఎక్కడో చూసినట్లుందే...? ఎవరు? ఎవరు?' అని ప్రశ్నించుకునే లోపల అందరికీ ఆత్మీయుడయిపోయే వాడు.

సన్నాసి లేని లోటు బాగా తెలుస్తోంది. సెంటర్‌కి వెళ్లినా, గుడి దగ్గరికి వెళ్లినా, నది గట్టు మీద నిల్చున్నా — ఎక్కడో ఒక ఖాళీ...

ఒక్కటే అనిపించింది.

"సన్నాసి మనకు దూరమైనా, అతని జ్ఞాపకాలు మాత్రం ఈ గోదావరి లా ఎప్పటికీ ఉంటాయి."

అయితే ...నాకెందుకో అతని కథ ముగియలేదు. నిజానికి ఇక్కడే మొదలయిందేమో అనిపించింది.

★★

కొంతమంది ఉంటారు, వాళ్లకు ఇతరుల సమస్యలు కూడా తమ సొంత సమస్యల్లాగే అనిపిస్తాయి. అందరూ తన వారనుకోవడం, తను అందరివాడినని అనుకోవడం వాళ్ళ స్వభావం. ఊళ్లో ఎవరికి ఏ అవసరం వచ్చినా, మొదట గుర్తొచ్చే పేరు 'సన్నాసి'. తనకు తోచింది, నచ్చింది ఎవరేమన్నా, లెక్కచేయక, చేసేసే ఒకే ఒక్కడు ఈ సన్నాసి.

చిరిగిన చొక్కాలోంచి చెమటోడుతున్న వీపు కన్పిస్తుంది. జుట్టంతా చిందర వందరగా ఉండి సగం ముఖాన్ని కప్పేసి ఉంటుంది.. లోతైన కళ్ళల్లోంచి ఓరకమైన కాంతి .

ఇదీ మేము రోజు చూసే సన్నాసి రూపం

నాకెందుకో అతనిలో కనిపించే ఆ స్పార్క్, అందరూ అనుకునేట్టు అతనో మాములు వ్యక్తి కాదు అనిపించేది. అసలుఅతను ఎక్కడ నుంచి వచ్చాడో తెలియదు. అడిగినప్పుడల్లా మాట దాటేసే వాడు. పైగా "ఇప్పుడు మీ దగ్గర ఉన్నాను కాబట్టి మీరే నా ఆత్మీయులు, బంధువులు" అనేవాడు.

"నీకు ఈ పేరు ఎవరు పెట్టారు ?ఎందుకు పెట్టార"ని అడిగితే, అందుకు అతనిచ్చిన జవాబు "పాత రోజుల్లో పుట్టిన పిల్లలు వెంటనే చనిపోతుంటే వాళ్ళకు కీడును సూచించే పేర్లు పెట్టేవారట. అలా నా పేరు పెట్టి ఉంటారు".

మా అందరి పక్షానా సన్నాసి ఊరు, తల్లి తండ్రుల వివరాలు అడిగారు పూజారి గారు,

"చాల ఏళ్ళ క్రితం మా అమ్మా నాన్న పుష్కరాలకి వెళ్లి నీళ్ళలో మునిగి చనిపోయారు. అప్పటి నుంచి ఒంటరి వాడినే" ఇదీ సన్నాసి జవాబు.

పిల్లల దగ్గర నుండి పెద్దల వరకూ అందరితోనూ కలివిడిగా ఉండేవాడు. నిజంగానే అతను తెలిసిన తెలియక పోయినా ప్రతి ఒక్కళ్ళకి అతనో కుటుంబ సభ్యుడిలా కలిసి పోయేవాడు, తన చదువేమిటో ఎవరికీ తెలియదు. కానీ అనర్గళంగా, తెలివిగా మాట్లాడేవాడు. అతని గొంతు ఎంతో శ్రావ్యంగా ఉండేది. భజన కార్యక్రమాలు నిర్వహించేవాడు.

ఎక్కడికి వెళ్లినా సన్నాసి భుజాన ఒక గుడ్డ సంచి ఉండేది. అందులో ఏముంటుందో ఎవరికీ చెప్పేవాడు కాదు. 'నీ ఆస్తి పాస్తి అంతా ఇందులోనే ఉందా ఏంటి సన్నాసి?' అని ఎవరైనా ఆటపట్టిస్తే, 'అవునన్నయ్యా.. నా లోకమంతా ఇందులోనే ఉంది' అని నిగూఢంగా నవ్వి ఊరుకునేవాడు

"ఒరే బాబూ, ఈ పని చేసిపెట్టరా!" అని ఎవరైనా అడిగితే చాలు, ఆంజనేయుడి లా వెళ్లి ఆ పని చేసేసి వచ్చేసేవాడు. అందులో చూపించే శ్రద్ధ, గమనించి అందరూ అభినందించే వారు – అసలు ఏ పనైనా అద్భుతంగా పూర్తి చేసేవాడు. ఊరంతా అతనికి బంధువులే, అందరూ ఆత్మీయులే. సన్నాసికి తల్లిదండ్రులు లేరన్న లోటు కనిపించేది కాదు.

మొదట్లో అతని పేరు కాస్త వింతగా అనిపించినా, క్రమంగా ఆ పేరు అందరికీ అలవాటైపోయింది. ఊరి చివర ఉన్న కిరాణా షాపు తాతారావు తన కొట్టు చూసుకోమని కోరగా, కొన్ని రోజులు ఆ పని చేశాడు. కానీ స్థిరంగా ఒకచోట ఉండే స్వభావం కాదు కదా, ఆ పనికి వేరే వాళ్ళను కుదిర్చి తను ఊరంతా తిరిగేవాడు. ఊళ్ళోకి వచ్చిన ఏ కొత్తవాడైనా అతని కళ్ల నుండి తప్పించుకోలేకపోయేవాడు.

సన్నాసి ఎక్కడుంటే అక్కడ మహా సందడి పుట్టించేవాడు. పైగా కబుర్లు నిజంగా జరిగినట్లే చెప్పేవాడు. "మద్రాసు వెళ్ళాను" అంటూ అడ్డపంచ, విభూతి ధరించి, అక్కడ సినిమా కబుర్లన్నీ వివరంగా చెప్పేవాడు. "అబ్బో, ఈ సన్నాసికి ఎన్ని తెలుసో!" అనుకునేవాళ్ళు

సన్నాసి పొద్దున్నే నది గట్టుకి వచ్చి స్నానం చేసి, దగ్గరలో ఉన్న ఆంజనేయస్వామిని దర్శించుకునేవాడు. పేరుపేరునా అందరినీ పలకరించేవాడు. అక్కడి నుంచి ఊరి మధ్యలోని సెంటర్‌కి వచ్చేవాడు. సన్నాసి రాగానే సెంటర్‌లో సందడి పెరిగిపోయేది. వచ్చింది ఒక్కడే అయినా పాతిక మంది వచ్చినట్టు ఉండేది. ప్రతి షాపులోకి వెళ్లి పలకరించి వచ్చేవాడు. రాజకీయాలపై ఆసక్తి ఉన్న వాళ్ళతో వాటి గురించి చర్చిస్తాడు. ఇక సినిమాల విషయానికొస్తే,అతన్ని పట్టే వారు లేరు. సినిమాలో ఉండే ఇరవై నాలుగు క్రాఫ్ట్స్ గురించి అనర్గళంగా మాట్లాడే వాడు

కార్తీక, మాఘ మాసాల్లో గుడి చాలా హడావుడిగా ఉంటుంది. అప్పుడు మధ్యాహ్నం రెండు గంటల వరకూ సన్నాసి గుడిలోనే ఉండేవాడు. అందర్నీ క్యూలలో నిలబెట్టడం, భక్తులకు సహాయం చేయడం అతని దినచర్య. ఎవర్నీ పేరు పెట్టి పిలిచేవాడు కాదు. "బావా", "అన్నయ్యా", "తమ్ముడూ", "మావయ్యా", "చెల్లెమ్మా" అంటూ వరసలు కలిపి మాట్లాడేవాడు.

సన్నాసి పేరు వినగానే అందరికీ గుర్తొచ్చేది గుడి పనులు, పుష్కరాల హడావుడి మాత్రమే కాదు. ఊరిలో ఎవరైనా అనాథగా చనిపోతే — ముందుగా గుర్తొచ్చే పేరు కూడా సన్నాసిదే. అనాథలకే కాదు, ఏ ఇంట్లో ఎవరు చనిపోయినా మొదట కనిపించేది కూడా సన్నాసే.

వార్త తెలియగానే పని వదిలేసి అక్కడికి పరిగెత్తేవాడు. ఇంట్లో వాళ్ళు శోకంలో ఉంటే వాళ్లని ఓదార్చేవాడు. “అన్నయ్యా, ధైర్యంగా ఉండాలి... చివరి కర్మలు గౌరవంగా జరగాలి” అని చెప్పేవాడు. చుట్టాలు రాకముందే, పూలు తెప్పించడం, పండితుడికి సమాచారం ఇవ్వడం లాంటి వ్యవహారాలు అన్నీ తనే చూసుకునేవాడు. శవాన్ని భుజాన మోసే వాళ్లు లేకపోతే, ముందుండి శవవాహకుడిగా భుజం పెట్టేది కూడా సన్నాసే.

“ఈ సేవ కంటే పెద్ద పని లేదు” అనేవాడు.

ఒకసారి రైల్వే ట్రాక్ పక్కన ఒక వృద్ధుడు చనిపోయి పడ్డాడు. ఎవరికీ అతని గురించిన వివరాలు తెలియవు. “పోలీసులు వచ్చి చూసుకుంటారు” అని అందరూ దూరంగా నిలబడ్డారు. కానీ సన్నాసి మాత్రం ఆ శవం దగ్గరే కూర్చున్నాడు. “బతికుండగా ఎవరూ అడగకపోయిన చచ్చాక ఒంటరిగా వదిలేయకూడదర్రా” అన్నాడు.

పోలీసులతో మాట్లాడి, తనే ముందుండి అంత్యక్రియల ఏర్పాట్లు చేశాడు. చితి దగ్గర నిలబడి, కళ్లలో నీరు పెట్టుకుని ఆ శవాన్ని చూస్తూ “అన్నయ్యా, నీ వాళ్లు ఎవరూ లేకపోయినా మనిషిగా పుట్టిన గౌరవం మాత్రం నీకు ఉండాలి” అని నెమ్మదిగా అన్నాడు.

అతను చేసిన పనికి “వీడు సన్నాసి కాదు... ఆ పరమ శివుడే ” అన్నారు అందరూ!

శ్మశానవాటికలో మంటలు ఎగసిపోతుంటే, అతను మాత్రం ఆ అగ్నిని గంభీరంగా చూస్తూ ఉండేవాడు. ఆ సమయంలో అతని ముఖంలో ఒక విచిత్రమైన ప్రశాంతత కనిపించేది.

"మనిషి చివరికి ఇలా ప్రశాంతంగా మారిపోతాడ అంతే జీవితం" వేదాంతంలో కూడా లోతైన వాడు సన్నాసి.

ఆ తర్వాత నది గట్టుకి వెళ్లి స్నానం చేసి, ఆంజనేయస్వామిని దర్శించుకుని, మామూలుగానే సెంటర్‌కి వచ్చి నవ్వుతూ కబుర్లు చెప్పేడు.

★★

సన్నాసి చేసే పనులు, అతని అమాయకపు గడుసుతనం, అందరికీ నచ్చేవి. అతను లేని రోజులు చాలా బోర్‌గా అనిపించేవి..

పుష్కరాలు వస్తున్నాయి. అందరి లో ఓ ఉత్సాహము. ఓ సంబరం. ఇహ సన్నాసి గురించి చెప్పనవసరం లేదు అప్పుడే అందరికీ తన గత పుష్కర అనుభవాలు కథలు కథలుగా చెబుతున్నాడు

సన్నాసికి పదేళ్ళ వయసున్నప్పుడు అతను మొదటి పుష్కరాలను చూశాడు. ఆనాటి జ్ఞాపకాలు అతని మనసులో చెరగని ముద్ర వేశాయి. తన ఇరవై రెండవ ఏట సన్నాసి రెండవ పుష్కరాలను చూశాడు. అప్పటికే అతనికి ఊళ్ళో ఓ గుర్తింపు వచ్చింది.. ఎవరికి ఏ అవసరం వచ్చినా సాయం చేసేవాడు.

ముప్పయి నాలుగేళ్ళకి మూడు పుష్కరాలు చూ సిన అనుభవం గడించుకున్నాడు.

పన్నెండేళ్లు గడిచాయి. మళ్ళీ పుష్కరాలు వచ్చాయి. ఇప్పుడు ఊరు మారింది. పాత తరం పోయి కొత్త తరం వచ్చింది. ఊరంతా కొత్త సొగసులతో కళకళ లాడుతోంది.

వయసు మీద పడుతున్నా మారనిది ఒక్క సన్నాసి మాత్రమే !

సన్నాసి వాళ్ళు ప్రపంచంలో చాలా అరుదు

★★

గోదావరి గట్టు మీద దీపాలు వెలుగుతున్నాయి. ఆ సాయంత్రం సన్నాసి లేని లోటు స్పష్టంగా కనిపిస్తోంది. పూజారి గారు తన చేతిలో ఉన్న ఆ పాత గుడ్డ సంచిని గట్టిగా పట్టుకుని మా అందరి వైపు చూశారు.

"ఇదిగో... సన్నాసి వదిలేసి వెళ్ళిన ఆస్తిపాస్తి ఇదే!" అంటూ ఆ సంచిని మా ముందు పెట్టారు పూజారి గారు.

అందరి కళ్లూ ఆ సంచి మీదే ఉన్నాయి. 'నా లోకమంతా ఇందులోనే ఉంది' అని సన్నాసి నవ్వుతూ చెప్పే ఆ సంచిలో ఏముందో చూడాలని అందరిలోనూ ఒకటే కుతూహలం. పూజారి గారి ముఖంలో ఒక వింతైన గంభీరత చోటు చేసుకుంది.

"ఇందులో ఏముందో చూశాను. సన్నాసి ఎవరో.. ఎక్కడి నుంచి వచ్చాడో.. అసలు అతను ఇన్నాళ్ళూ మన మధ్య ఎందుకు ఇలా ఉన్నాడో అన్నీ తెలిశాయి. ఆ వివరాలు వింటే మీరు ఆశ్చర్యపోతారు.." అంటూ పూజారి గారు ఆ సంచి ముడి విప్పబోయారు.

నా మనసు ఒక్కసారిగా చివుక్కుమంది. ఏదో తెలీని భయం.. సన్నాసి గురించి నిజాలు తెలిస్తే, ఇన్నాళ్ళూ మేము ప్రేమించిన ఆ 'సన్నాసి' అదృశ్యమైపోతాడేమో అనిపించింది. వెంటనే పూజారి గారి చేతిని పట్టుకుని ఆపాను.

"వద్దు గురువుగారు! ఆ ముడి విప్పకండి.." అన్నాను ఆవేశంగా.

అందరూ నా వైపు ఆశ్చర్యంగా చూశారు.

"ఎందుకు రా? తనెవరో తెలిస్తే తప్పేముంది?" అన్నాడు మిత్రుడు తాతారావు.

“నా దృష్టి లో తప్పే, అది సన్నాసి స్వవిషయం. అతను మనకి చెప్పే మాటయితే ఎప్పుడో చెప్పేవాడు, చెప్పకూడనివో, చెప్పుకోని లేనివో ... అవి మనకు తెలియదు కాబట్టి, మనం అతని మీద గౌరవంతో తెలుసుకునే ప్రయత్నం చేయద్దు నిజాలు తెలుసుకోవడం కంటే.. ఆ మనిషి మనకిచ్చిన ఆత్మీయతను గుర్తుంచుకోవడం గొప్పది కదా !ఆ సంచిలో అతని గతం ఉండొచ్చు, అది మనకు నచ్చచ్చు నచ్చకపోవచ్చు , ఒక అపరిచితుడిగా మన జీవితాల్లోకి వచ్చి, అందరికీ ఆత్మీయుడైన ఆ సన్నాసికి మనం ఇచ్చే గౌరవం ఇదే. అందుకే అతన్ని 'సన్నాసి' గానే మిగిలపోనీండి” అన్నాను.

పూజారి గారు ఒక్క క్షణం నా కళ్ళల్లోకి చూశారు. మెల్లగా ఆ సంచి ముడిని మళ్ళీ బిగించారు.

"సరిగ్గా చెప్పావు బాబూ. కొన్ని రహస్యాలు,రహస్యం గానే మిగిలిపోవాలి” అన్నారు. మిగతావాళ్ళు కూడా అవునన్నట్లు తలలూపారు

అతని కథ నిజంగానే ముగిసిందా? లేక ఆ సంచిలోని రహస్యంతో పాటు మరో కొత్త ప్రయాణం మొదలుపెట్టాడా? తెలియదు.

మనిషి జీవితం లో ఎన్నో కనిపించని నీడలు ఉంటాయి.. ఆ నీడలు మనకు అపరిచితాలు.

అయితే ఇంకో ప్రశ్న నా ఎదుట నిలిచింది. అతని గత జీవితం గురించి తెలిస్తే నేను నమ్మిన ఒక సత్యం నిజం కాదేమో అని భయపడ్డానా ? ఏమో ?

కానీ ఒక్కటి మటుకు సత్యం .. సన్నాసి మా అందరికీ తెలిసిన అపరిచితుడు .

.★★★★★★★★★★

COMMENTS